# బహుమతి గ్రహీత

**జి. భవానీరమణ**

దుమ్ము!

ఎక్కడ చూసినా దుమ్ము, ఆఫీసు మెయిన్ రోడ్డుకి పక్కగా ఉందేమో, రోజూ ఇంతింత దుమ్ము ఆఫీసు నిండా పేరుకుంటూ ఉంటుంది, అయితే నా సమస్య దుమ్ము వల్ల కాదు, దాన్ని దులపవలసిన మా స్వీపర్ పుల్లయ్య వల్ల! స్వీపర్‌గా అతనికి పదిహేను సంవత్సరాల అనుభవం (?) ఉంది, అతనికి నచ్చిన చోట శుభ్రపరుస్తాడు, మిగిలిన ప్రదేశమంతా ఎలా ఉన్నా పట్టించుకోడు. నా కేబిన్ మాత్రం తప్పనిసరిగా అప్పుడప్పుడూ శుభ్రపరుస్తాడు, ఎందుకంటే నేనిక్కడ మేనేజర్ని కాబట్టి.

ఇది వింటుంటే మీకు నవ్వొస్తున్నదనుకుంటాను. ఒక స్వీపర్ చేత సరిగా పని చేయించలేని నేనేం మేనేజర్నా అని. నిజమే, నా స్థానంలో మీరుంటే గానీ అది మీకు అనుభవైకవేద్యం కాదు.

అయితే పుల్లయ్య చేత పని చేయించడానికి కేవలం నా హోదా తప్ప, ఏ విధమైన పలుకుబడి గానీ, డబ్బు గానీ, శారీరక బలం గానీ ఉపయోగించకూడదని కంకణం కట్టుకుని, ఆ విధంగా మాత్రమే ప్రయత్నిస్తున్నాను. ఎంత కాలానికి సఫలీకృతుణ్నవుతానో తెలీదు. అయితే నేనిప్పుడు మీకు చెప్పాలనుకుంటున్న విషయం, వాడిని నేనెంత గొప్పగా మార్చానో చెప్పడం కాదు!

ఈ బ్రాంచి మేనేజర్‌గా వచ్చిన మొదటిరోజే తన టేబుల్ శుభ్రం చెయ్యలేదని, మా క్యాషియర్ రావు పుల్లయ్య మీద ఫిర్యాదు చేశాడు. వెళ్లి చూద్దును కదా, కుర్చీ, టేబుల్ నిండా రూపాయి బిళ్లంత మందాన దుమ్ము ఉంది. పుల్లయ్యని పిలిచి చెప్పాను, అతడు దులిపేవరకూ నేనిక్కడి నుండీ కదలదలుచుకోలేదు, అది గమనించి నా మీద గౌరవం/భయం (?) చేత అప్పటికప్పుడు ఓ బట్టతో పైపైన దులిపాడు. అది రావుకి నచ్చలేదు. నేను తనకి సపోర్ట్‌గా ఉన్నాననే ధీమాతో పుల్లయ్యని గదమాయించి, నచ్చినట్టుగా శుభ్రం చేయించుకున్నాడు. మర్నాడు మళ్లీ అదేతంతు. ఈ సారి రావు తోపాటు మరో నలుగురు స్టాఫ్ మెంబర్లు ఫిర్యాదులు చేశారు. నాకు పుల్లయ్య మీద చాలా కోపం వచ్చింది. వెంటనే లెటర్ ప్యాడ్ తీసుకుని విధినిర్వహణలో పుల్లయ్య మొండి వైఖరిని నిరసిస్తూ జవాబు చెప్పమని, లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందనీ మెమో టైప్ చేయించి ఇచ్చాను.


ఆ రోజు బ్రాంచికి సంబంధించిన చాలా మానవసంబంధితవిషయాలు నా దృష్టిలో కొచ్చాయి.

పుల్లయ్య కిచ్చిన మెమో పట్టుకుని లంచ్ టైంకి ఓ అరగంట ముందుగా కిశోర్, నా కేబిన్‌లోకి వచ్చాడు. పుల్లయ్యకు సభ్యత్వం ఉన్న యూనియన్ తాలూకు లీడర్ కిశోర్.

"పుల్లయ్యకి మెమో ఇవ్వడం ఏం బాగోలేదు సార్!" అన్నాడు కిశోర్, నేను కూర్చోమని చెప్పకుండానే, నా ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ.

"ఎందుకు బాగా లేదు?" అన్నాను నేను.

"పుల్లయ్య తన పని తను సరిగానే చేస్తున్నాడు, ఏదో రావు లాంటి వాళ్లు ఫిర్యాదు చేసినంత మాత్రాన మెమో ఇవ్వడం న్యాయం కాదు."



రావుదీ, కిశోర్‌దీ, ఒక యూనియన్ కాదన్న విషయం నాకు తెలుసు. మా బోటి ప్రభుత్వసంస్థల్లో ఒకే కేడర్లో ఉండే ఉద్యోగులకి కూడా వంద రకాల యూనియన్లు ఉండడం సాధారణవిషయమే.

"రావుగారు చేసిన ఫిర్యాదు వల్ల నేనా మెమో ఇవ్వలేదు. పని పట్ల పుల్లయ్యకున్న నిర్లక్ష్యం నేను స్వయంగా చూశాను కాబట్టి ఇచ్చాను" అన్నాను.

"ఇది చాలా దుమ్ము ప్రాంతం సార్. పుల్లయ్య ఎంత శుభ్రం చేసినా, కొద్ది సేపట్లోనే మళ్లీ వచ్చి పడిపోతుంది. అయినా పుల్లయ్య మన బ్రాంచికి పార్ట్ టైం స్వీపర్ మాత్రమే, పొద్దున ఒకసారి వచ్చి శుభ్రపరచి వెళ్లిపోతాడు, ఆ తర్వాత పడే దుమ్ముకి అతనెలా బాధ్యుడౌతాడు? అతడి పనిని అతడు సక్రమంగానే చేస్తున్నాడు" అన్నాడు కిశోర్.

ఇలాంటి యూనియన్ గొడవేదో తలెత్తుతుందని మెమో ఇచ్చే ముందే ఊహించి ఉండడం చేత, పార్ట్ టైం స్వీపర్ విధులేమిటో రాసి ఉన్న సర్క్యులర్ తెప్పించి చదివి, నా టేబుల్ డ్రాయర్లో ఉంచుకున్నాను. దాన్ని తీసి కిశోర్ ముందు ఉంచి, "ఇది చదివి చెప్పండి, మన పుల్లయ్య అందులో రాసిన ఎన్ని పనులు సక్రమంగా చేస్తున్నాడో" అన్నాను.

"రోజూ నేలా, బల్లలూ, కుర్చీలూ శుభ్రపరచడంతో పాటు, బూజు దులపడం, ఉద్యోగులందరికీ మంచినీళ్లు ఏర్పాటు చేయటం, టాయిలెట్లలో నీళ్లు పట్టి ఉంచడం, వారానికోసారి ప్రాంగణమంతా కడగడం, వగైరా వగైరా వంటి శుభ్రతకి సంబంధించిన పనుల



జాబితా ఆ సర్క్యులర్లో ఉంది. టాయిలెట్లో పంపులు ఉండడం చేత అక్కడ నీళ్లు పట్టవలసిన అవసరం పుల్లయ్యకు లేదు, తాగే నీటికి సంబంధించిన జాగ్రత్త ఎక్కువ కావడంతో స్టాఫంతా ఎవరి మంచినీళ్లు వాళ్లే ఇళ్ల నుండి తెచ్చుకుంటున్నారు, కనుక ఆ పనికి సంబంధించి పుల్లయ్య మీద ఒత్తిడేం లేదు. పనికి అడ్డం రానంతవరకూ బూజును గురించి గానీ, ప్రాంగణం కడగడం గురించి గానీ ఇంత వరకూ అడగలేదు. ఇక మిగిలింది నేల ఊడ్చి, బల్లలూ, కుర్చీలూ తుడవడం వరకే అతడి దినసరి. అది కూడా సరిగా చెయ్యనివాడికి ఈ మెమో ఏ పాటి శిక్ష?"

చిన్నపాటి సమస్య అనుకున్నదాన్ని నేనింత విశ్లేషించి చూపిస్తాననుకోలేదు కిశోర్. అతడి ప్రవేశంతో సమస్యని తగవుగా మారుస్తానని ఊహించాడతను.

క్షణం మౌనంగా ఉండి అన్నాడు, "శిక్ష ఏ పాటిదన్నది ప్రశ్న కాదు. రేపెప్పుడైనా పుల్లయ్యకు పదోన్నతి లభించే పరిస్థితి వస్తే ఈ మెమో ప్రతిబంధకమౌతుంది, అందువల్ల దీన్ని మీరు ఉపసంహరిస్తే, నయానో, భయానో అతడి చేత పనులు చేయించుకోవచ్చు."

కిశోర్ మాటల్లో కొంత వాస్తవం ఉంది. కానీ పుల్లయ్యకి పదోన్నతి కాంక్షించడమే నాకెందుకో సబబుగా తోచలేదు. అయితే మా సంస్థలోనే ఎంతో ఉన్నతపదవుల్లో ఉండి, పుల్లయ్యపాటి విధిని కూడా నిర్వహించని మహానుభావుల్ని ఎందరినో నేనెరుగుదును. మరి వాళ్లెవరూ ఇలా 'మెమో'ల బారిన పడిన దాఖలాలు నా దృష్టికి రాలేదు. పైగా మెమో ఇచ్చినందుకు కిశోర్ నన్ను తప్పు పట్టడమో, బెదిరించడమో చెయ్యడం లేదు, కేవలం బతిమాలుతున్నాడనే కారణం చేత, అప్పటికి ఆ మెమోను ఉపసంహరించుకున్నాను.

అయితే కిశోర్ ప్రవర్తన నా దగ్గర ఒకరకంగా, బయట మరో రకంగా ఉందన్న విషయం క్యాషియర్ రావు వచ్చి చెప్పిందాకా, నాకు తెలియదు. కిశోర్‌కి భయపడి నేను మెమో ఉపసంహరించుకున్నాననీ, లేకపోతే బ్రాంచంతా అల్లకల్లోలం జరిగిపోయి ఉండేదనీ అందరి దగ్గరా చెప్పాడు. లేకపోతే అతడి లీడర్ గిరికి భంగం ఏర్పడుతుందని అతడి భయం కాబోలు. కానీ అలా చెప్పడం వల్ల పుల్లయ్యలో ఏ మార్పూ రాలేదు సరి కదా, కిశోర్ వ్యతిరేక వర్గమైన రావుగారి వర్గం నుండీ నాకు మళ్లీ ఒత్తిడి మొదలయింది.

దుమ్ము సమస్య మళ్లీ మొదటికొచ్చింది!

చెత్త కాగితాలూ, పనికిరావని అప్పుడప్పుడూ తీసి పడేసిన వస్తువులూ ఓ మూలన గోడవారగా పడేసి ఉన్నాయి. అవి ఆఫీసు మెయిన్ హాలులో ఉండటమే అసహ్యంగా ఉంది, పైపెచ్చు వాటి నిండా బోల్డంత దుమ్ము. ఎంత లీడరైనా శుభ్రపరచకపోవడాన్ని కిశోర్ లాంటివాడు ఎలా వెనకేసుకొస్తున్నాడో నాకర్థం కాలేదు. ఆ మాటే రావుగారితో అంటే, అసలు సంగతి బయటపెట్టాడు. కిశోర్ నడిపే వడ్డీ వ్యాపారానికి పుల్లయ్య వసూలుదారు. వాళ్ల ఇద్దరి మధ్యా లీడరు—సభ్యుడు బంధం కన్నా గొప్పదైన ఈ అనుబంధం వల్ల అదంతే అన్నాడు. ఒకోసారి పుల్లయ్యకి జీతం కన్నా వసూళ్లకి వచ్చే కమీషన్ ఎక్కువగా ఉంటుందని చెప్పాడు.

రావుగారితో మాట్లాడుతుండగా, బ్రాంచిలో గుప్పున చుట్ట పొగ వాసన వచ్చింది. తలెత్తి చూద్దుగదా ముఖద్వారం నుండీ పటేలు లోపలికి వస్తున్నాడు. పటేలు మా బ్యాంకుకి పెద్ద కస్టమరు, మా ఋణగ్రహీత. ఎప్పుడు చూసినా జర్దా కిళ్లీ నములుతూ, చుట్ట కాలుస్తూ కనిపిస్తాడు. అతడు లోపలికి వస్తూనే ఉమ్మి వేయాల్సిన అవసరం ఏర్పడినట్లుంది, ఆ మూలా ఈ మూలా ఓ క్షణం పరికించి చూశాడు. నేనిందాక చెప్పిన చెత్త పడేసిన మూల అతన్ని ఆకర్షించింది, గబగబా అక్కడికి నాలుగడుగులు వేసి, తుపుక్కున ఉమ్మేసి, చేతిలో వెలుగుతున్న చుట్టను గోడకేసి నులిమేశాడు. నులిమినంత మేరా గోడ నల్లగా మారిపోయింది.

ఈ దృశ్యాన్ని నాతో పాటు దాదాపు అందరూ చూశారు. అయితే అదేదో మామూలు విషయంలాగే భావిస్తూ, పైగా పటేలుకి నమస్కారాలు కూడా చేసి, మళ్లీ ఎవరి పనుల్లో వాళ్లు నిమగ్నమైపోయారు.

చివరికి ద్వారం పక్కన కూర్చుని ఇటువంటివి ఎవరైనా చేస్తే క్లాసులు తీసుకునే మా గార్డు రాఘవయ్య కూడా, అతన్ని ఏమీ అనకుండా, "నమస్తే పటేలుగారూ, బాగున్నారా?" అంటూ సాదరంగా మాట్లాడి, వచ్చిన పని చేసుకోండన్నట్లు నా దగ్గరికి పంపాడు. అయినా ఆఫీసు పరిసరాలు పరిశుభ్రంగా లేనప్పుడు పటేల్ను అనుకునేం ప్రయోజనం?

పటేలు నా కేబిన్‌లోకి వచ్చి నమస్కారం చేశాడు.

ప్రతినమస్కారం చేసి, "కూర్చోండి" అన్నాను అప్రయత్నంగా.

పటేలు రాకతో రావు నా కేబిన్నుండీ నిష్క్రమించాడు. పటేలు వెనకే ఇద్దరు పనివాళ్లు నాలుగు బుట్టల నిండా ద్రాక్షపళ్లు పట్టుకువచ్చి నా కేబిన్లో పెట్టి వెళ్లిపోయారు.

"మీ దయ వల్ల ఈ సారి కూడా మా ద్రాక్ష పంట బాగా వచ్చింది సార్, ఇవి మీకు "అంటూ ఓ పెద్ద బుట్ట నాకోసం ప్రత్యేకం అన్నట్టు చూపించి, "మిగతావి మీ స్టాఫ్ మెంబర్లకి" అన్నాడు.

**మిగతా వచ్చేవారం**